క్లుప్తంగా...

ఆలయ అర్చకుల రక్తదానం



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, గోపూజ, అర్చన, అభిషేకాలు, వేద పారాయణం జరిగాయి. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఉచిత నేత్ర పరీక్షలు కూడా నిర్వహించారు. హరికథా సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థాన దాతలు రమేష్ చౌదరితో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి



నమోదును ప్రారంభిస్తున్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి కోరారు. టీపీసీసీ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ప్రదర్శించి డోర్ టూ డోర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖైరతాబాద్ జిల్లాలోని అన్ని డివిజన్లలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయించి ఈ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ కూడా పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదం



విశ్వ భారత్ పార్టీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: యువత ఉద్యోగాలు లేక, రైతుల పంటలు అకాలవర్షాలతో నష్టపోతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉందని విశ్వ భారత్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు ఎస్.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లలో ఏం సాధించారని సంబురాలు చేసుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎం.రవి ప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగాన్ని సమగ్రంగా నివారిస్తామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, దక్షిణాది రాష్ట్రాల్లో పోటీ చేస్తామని తెలిపారు. సమావేశంలో నేతలు మేకల నర్సింహారెడ్డి, బొంద్యాలు బానోత్, స్వప్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో 58 జీవో దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుల పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

రహమత్‌నగర్: రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం బుధవారం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీ ఆర్ హిల్స్‌లో బుధవారం పర్యటించారు. 58 జీవో కింద చేసుకున్న దరఖాస్తులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి (డిప్యూటీ కలెక్టర్) ఆదిలక్ష్మీ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం ఐదు బృందాలు దరఖాస్తులను పరిశీలిస్తున్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి నివాసాల వద్దకు తామే స్వయంగా వెళ్లి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఖైరతాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ భిక్షం, సీనియర్ అసిస్టెంట్ సునీల్, స్పెషల్ ఆర్ఐ కిరణ్‌రాజ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా.. మంచిదేగా!

- ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా డే
- వాడవాడలా యోగా చేసిన ఔత్సాహికులు
- ప్రత్యేక విన్యాసాలతో సందడి చేసిన విద్యార్థులు

ఫిలింనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు యోగా విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ప్రాచీన యోగా పట్ల అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి వెల్లడించారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు నిత్యం జీవితంలో యోగా ప్రాధాన్యతను ఆమె వివరించారు. యోగా ఆవశ్యకతను వైస్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి సవివరంగా తెలియజేశారు. యోగాసనాలతో విద్యార్థులు విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే కార్యక్రమాలు అన్నింటిలో విద్యార్థులంతా ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని కోరారు.

జీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో...

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో విద్యార్థులు యోగా విన్యాసాలు చేశారు. యోగా ఫర్ వసుధైక కుటుంబం పేరుతో ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్ వెల్లడించారు. యోగా వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చునని శారీరకంగా దృఢంగా ఉండవచ్చునని ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆమె తెలిపారు. ముఖ్య అతిథిగా రిసోర్స్‌పర్సన్ సుహాస్‌రెడ్డి హాజరై విద్యార్థులతో పలు ఆసనాలు వేయించారు. ప్రైమరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో...

బంజారాహిల్స్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సింప్లీ నాంధారి స్టోర్స్‌లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో సిబ్బంది, ఉద్యోగులతో పాటు పలువురు వినియోగదారులు పాల్గొని యోగాసనాలు వేశారు.

హోంసైన్స్ కళాశాలలో...

ఖైరతాబాద్: సైఫాబాద్‌లోని హోంసైన్స్ కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ విజయలక్ష్మి, జాతీయ సేవా పథకం విభాగం ఆఫీసర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



జీవీబీపీ ఆత్మకూరిరామారావు స్కూల్‌లో...

లేక్‌వ్యూ పార్క్‌లో

ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్క్‌లో కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా డేలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి పాల్గొన్నారు. వాకింగ్‌కు వచ్చిన వారితో కలిసి యోగా చేశారు.

యోగాతో మానసిక రుగ్మతలు మాయం

వెంగళరావునగర్: నిత్యం యోగా చేయడం వల్ల అటు శారీరక ఆరోగ్యంతో పాటుగా మానసిక రుగ్మతలు కూడా మటుమాయం అవుతాయని సాయి సరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్ నిర్వాహకురాలు శిరీషాభవానీశంకర్ తెలియజేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిసరస్వతి విద్యానికేతన్‌లో ఘనంగా నిర్వహించారు. టీచర్లు, విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగీతం వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. చిన్నారులు చదువుతో పాటుగా సంగీత విద్యలో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించాలని సూచించారు.

యోగా ముద్రతో పరిపూర్ణ ఆరోగ్యం...

వెంగళరావునగర్: యోగా ముద్రల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ యోగా ముద్ర నిపుణులు ధరణీప్రగడ ప్రకాశ్‌రావు తెలిపారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ప్రకాశ్‌రావును, యోగా గురువులైన నాగేశ్వరరావు, దేవదాస్ చౌహాన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివ రావు, మన్నె కళ్యాణ చక్రవర్తి, ఉపాధ్యక్షులు సి.హెచ్.సత్యనారాయణ రాజు, కోశాధికారి ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ శ్రీలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేహెచ్‌పీఎస్‌లో యోగాలో పాల్గొన్న విద్యార్థులు



లేక్‌వ్యూ పార్క్‌లో కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి...



హోంసైన్స్ కళాశాలలో...



మధురానగర్‌కాలనీలో యోగా గురువు ప్రకాశ్‌రావును సన్మానిస్తున్న కాలనీ నేతలు



యోగా చేస్తున్న సింప్లీ నాంధారి స్టోర్‌సిబ్బంది, వినియోగదారులు



శ్రీకృష్ణానగర్‌లో యోగా చేస్తున్న చిన్నారులు, టీచర్లు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి...

రహమత్‌నగర్: ప్రభువైన ఏసుక్రీస్తు కృప వల్ల తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకాంక్షించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ క్రిష్టియన్ ఫోరం ఆధ్వర్యంలో కార్మికనగర్ చర్చిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్, జేసీఎఫ్ నాయకులు విద్యా సాగర్ పాల్, రాకేష్, క్రిష్టఫర్, విలియమ్స్, సీఎల్ ప్రకాశం, రాములు, బీఆర్ఎస్ నాయకులు నజీర్, రవిశంకర్, విజయ్‌కిరణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రహమత్‌నగర్: అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న రహమత్‌నగర్ లైబ్రేరియన్ శ్రీనివాస్‌ను దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ప్రసన్న, కార్యదర్శి పద్మజ ఘనంగా సన్మానించారు.

ద్విచక్ర వాహనం ఎవరిదో?



వెంగళరావునగర్: దేవాలయం ముందు పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని తొలగించాలని పోచమ్మ దేవాలయం కమిటీ నేతలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... నెలరోజులుగా యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్ ప్రధాన రహదారి ఉన్న శ్రీ పోచమ్మ తల్లి ఆలయం గోడ పక్కన గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని (ఏపీ 04 ఏఓ 7811) పార్కు చేసి వెళ్లారు. కొన్నిరోజులు చూసిన దేవాలయం సిబ్బంది ఈ వాహనం గురించి వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. అనుమానించిన ఆలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యమకారులను కడుపులో పెట్టుకొని చూసుకుంటా

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉద్యమకారుల సంక్షేమాన్ని, వారి యోగక్షేమాలను చూసుకునే పూర్తి బాధ్యత తనదేనని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సత్కరించి ఉద్యమ సమయంలో వారి సేవలను కొనియాడిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే బాధ్యత కూడా తనదేనన్నారు. ఉద్యమకారుల్లో దళితులు ఉంటే దళితబంధు కింద వారిని లబ్ధిదారులను చేస్తానని అన్నారు. అర్హులైన వారికి తన కోటా కింద వచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. బీసీలకు రూ. లక్ష సాయం, గృహలక్ష్మి పథకం కింద ఎంత మంది అర్హులు ఉంటే అంత మందిని లబ్ధిదారులను చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను పాల్గొనలేకపోయినా ఓయూలో ఉద్యమంలో పాల్గొంటున్న వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. కొన్ని పరిస్థితుల వల్ల తాను ఉద్యమంలో పాల్గొనలేకపోయానని ఇప్పుడు ఉద్యమకారుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కింద పని చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ వస్తే అభివృద్ధి జరగదేమోనని చాలా మంది అనుకున్నారని కానీ ఇప్పుడు తెలంగాణ దేశానికి రోల్‌మోడల్‌గా మారిందని ఆ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారులు సి.రాంచందర్, టీఆర్ఎస్‌వీ నేత మధుకర్ యాదవ్, రావుల విజయ్‌కుమార్, ఉమ, రాజేశ్వరి, సారంగపాణి, నర్సింహా, విష్ణునాయక్, మోయిజ్, గడ్డం వినయ్, కళ్యాణ్‌దాస్, శ్రీధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మృతి చెందిన ఉద్యమకారులకు నివాళిగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.



ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దానం

14న ఢిల్లీలో బీసీల మహాధర్నా



మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్నగౌడ్

పంజగుట్ట: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 14న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నా పోస్టర్‌ను రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు గాదగోని మహేష్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ జనాభాలో సగం శాతం ఉన్న బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాల్లానే చూస్తున్నారని 542 పార్లమెంట్ స్థానాలు ఉంటే 270 బీసీ పార్లమెంట్ సభ్యులు ఉండాల్సిన చోట కేవలం 80 మంది మాత్రమే ఉండటం అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 119 ఎమ్మెల్యే స్థానాలు ఉంటే 60 మంది బీసీ శాసనసభ్యులు ఉండాల్సిన చోట కేవలం 22 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు 93వ రాజ్యాంగ సవరణ చేసి పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని కాని బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు లేక ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా దక్కాలని తెలిపారు. పై డిమాండ్ల సాధనకు జూలై 14వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా, 15వ తేదీన జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సూరగాని రాంబాబు, నర్సింహా, వెంకటేశ్వర్లు యాదవ్, లక్ష్మణ్ యాదవ్, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయానికి స్థలం కేటాయించండి

రహమత్‌నగర్: రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని కేటయించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా అడ్వైజర్ మహ్మద్ షబ్బీర్ విజ్ఞప్తి చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ... రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని తమ బృందం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను గత ఏడాది జనవరిలో వినతి పత్రం సమర్పించామన్నారు. స్పందించిన గవర్నర్ జిల్లా కలెక్టర్‌కు పంపించారన్నారు. అయితే నేటికీ రెవెన్యూ అధికారులు తమ సంస్థకు స్థలం కేటాయించక పోవడం విచారకరమన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ప్రభుత్వ స్థలంలో తమ సంస్థ కార్యకలాపాల నిర్వహణ కార్యాలయం కోసం స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని షబ్బీర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బ్యాగరి కులస్తులకు అన్యాయం చేస్తే సహించం

మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య

పంజగుట్ట: తరతరాలుగా శ్మశానవాటికలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న బ్యాగరి కులస్తులను శ్మశానవాటికల అభివృద్ధి పేరుతో అక్కడ నుంచి తరిమేసేందుకు చూస్తే సహించేది లేదని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ డబ్బుతో అభివృద్ధి చేసిన శ్మశానవాటికలను మహాప్రసానం అని పేరుపెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ బడా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పచెపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బేగంపేట శ్మశానవాటికలో గత 30 సంవత్సరాలుగా ఆరు బ్యాగరి కుటుంబాలు నివసిస్తూ అక్కడకు తీసుకొచ్చిన శవాలను కాలుస్తూ జీవనం సాగించేవారని తెలిపారు. ప్రస్తుతం మహాప్రస్థానం పేరుతో అభివృద్ధి చేసి బడా కాంట్రాక్టర్‌కు అప్పగించి అందులో నివసిస్తున్న ఆరు కుటుంబాలను బలవంతంగా బయటకు గెంటేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కుటుంబాలు గట్టిగా ప్రతిఘటించి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారని వారికి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, కాడారం వినయ్‌కుమార్, మన్నె శ్రీధర్‌రావు, ఇందిర, బాధితురాలు మర్రి మాధవి పాల్గొన్నారు.

వైభవంగా ఆధ్యాత్మిక దినోత్సవం



బోనాలు ఎత్తుకున్న మహిళలు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ వేడుకల్లో భాగంగా ఫిలింనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గడచిన తొమ్మిది సంవత్సరాలలో అనేక దేవాలయాల్లో ధూప, దీప నైవేద్య పథకాల్లో భాగంగా భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వెల్లడించారు. గతంలో భక్తులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు అవే దేవాలయాల్లో పునరుత్తేజం కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చిసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. భారీ సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించగా స్థానికంగా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు కవితారెడ్డి, సంగీతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సహజీవనం చేశాడు.. పెళ్లి చేసుకోమంటే బెదిరించాడు

బాధితురాలి ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

బంజారాహిల్స్: తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే న్యూడ్ వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్న వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్.ఎన్.నగర్‌లో నివసించే యువతికి అదే ప్రాంతంలో నివసిస్తున్న దెబాస్ దేకా(27)తో గతేడాది అక్టోబర్‌లో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చేశాడు. అప్పటి వరకు సహజీవనంతో కలిసి ఉందామని నమ్మించాడు. తరచూ ఆమెకు ఇష్టం లేకుండానే లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. గత మార్చి 26వ తేదీన యూసుఫ్‌గూడలోని తన గదిలో అత్యాచారానికి పాల్పడ్డాడని ఆ సమయంలో కూడా పెళ్లి చేసుకోవాలని ప్రాధేయపడ్డట్లు ఆమె వెల్లడించింది. ఇష్టం లేకుండానే బలవంతంగా శారీరక వాంఛలు తీర్చుకునేవాడని ఎన్నోసార్లు వ్యతిరేకించడం జరిగిందని పేర్కొంది. ఇటీవల పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండగా తన న్యూడ్ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేసింది. దేబాస్ దేకాపై ఐపీసీ సెక్షన్ 376, 420 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన రౌడీషీటర్‌కు జైలు శిక్ష



నిందితుడు ఫరీద్ ఖాన్

బంజారాహిల్స్: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన రౌడీషీటర్‌కు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే ఫరీద్‌ఖాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. మెకానిక్‌గా పనిచేసే ఫరీద్ కొంత కాలంగా బస్తీలో న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. రెండు రోజుల క్రితం ఓ మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పిట్టీ కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నాంపల్లిలోని పదవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.